క్రైస్తవుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే బండారి

విద్యామారుతీ నగర్ కాలనీలోని సన్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ చర్చి 23వ వార్షిక క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య తదితరులు

చర్లపల్లి, డిసెంబర్ 16 : క్రైస్తవుల సంక్షేమానికి తనవంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం చర్లపల్లి డివిజన్, విద్యామారుతీనగర్ కాలనీలోని సన్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ గొల్లూరి చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చి 23వ వార్షిక క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చర్చిల వద్ద సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రిస్మస్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, డివిజన్లలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం హెచ్‌బీకాలనీ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు ప్రసంగించి.. ఎమ్మెల్యేను ప్రార్థనల ద్వారా దీవించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, కాలనీవాసులు, స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

భరత్‌నగర్ ప్రభుత్వ స్కూల్‌లోని విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 16: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మచ్చ బొల్లారం డివిజన్, భరత్‌నగర్, రాజీవ్ గృహకల్ప బస్తీలలో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడా వస్తువులు, తాగునీరు, బాత్‌రూంల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. భరత్‌నగర్, రాజీవ్ గృకల్ప బస్తీలలో నివసిస్తున్న పేదలకు గత రెండు దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ రమేశ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, బుచ్చి, మల్లేశ్ యాదవ్, సత్యనారాయణ, తిరుపతయ్య, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

వేడుకలకు హాజరైన ప్రతినిధులు

ఉప్పల్, డిసెంబర్ 16 : ఉప్పల్ పాస్టర్స్ ఫెలోషిప్ గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్-2023ను శనివారం ఘనంగా నిర్వహించారు. హోరేబు మినిస్ట్రీస్ అండ్ యూసీపీడబ్ల్యూ ఫౌండర్ చైర్మన్ గోన ఫిలిప్ ఆధ్వర్యంలో కేకేగార్డెన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ సువార్తికులు కేవీ పాల్ హాజరై బైబిల్ వాక్యం ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. సురేశ్‌శ్యాం, గోన అనిల్, డా.జంపాల రవితేజ, జెరుషలేం మత్తయ్య, పాస్టర్లు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

శ్రీకోదండరామ ఆలయ నూతన కార్యవర్గం..

ఉప్పల్, డిసెంబర్ 16 : హబ్సిగూడ స్ట్రీట్ నం.8లోని శ్రీసత్యనారాయణ స్వామినగర్‌లోని శ్రీకోదండరామ ఆలయ నూతన కమిటీని శనివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా యాదవరెడ్డి, అధ్యక్షుడిగా మ ల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సతీష్‌రెడ్డి, భద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా భాను సత్య శివరాం, సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా స్వామి, సలహాదారులుగా అశోక్‌రెడ్డి,దామోదర్‌రెడ్డి, నర్సింహా, ఈసీ మెంబర్స్‌గా ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సంజయ్, ధర్మారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలు ఎన్నికైనారు.

శివసాయినగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ..

చర్లపల్లి, డిసెంబర్ 16 : చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మారెడ్డి, కొండగళ్ల అశోక్‌లు ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. అలాగే..ఉపాధ్యక్షులుగా కాసుల సురేశ్‌గౌడ్, నర్సింహులు, కోశాధికారిగా సరికొండ రమేశ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు పద్మారెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కాలనీ పూర్తిస్థాయి కమిటీని త్వరలో ఎన్నుకుంటామని, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవిల సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ కాలనీలకు చెందిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్ల పంపిణీ

కాప్రా, డిసెంబర్ 16 : కాప్రా డివిజన్, ఈశ్వరిపురి హైటెన్షన్ రోడ్ గణేశ్ మార్బుల్స్ వెనుక వీధి మున్సిపల్ పార్కులో ఆదివారం ఉచితంగా మొక్కలు, పక్షిగూళ్లు, నీళ్లకుండీలు, దానా పంపిణీ చేయనున్నట్లు పర్యావరణ వేత్త నంబూరి కృష్ణంరాజు తెలిపారు. పనస, ఉసిరి, మారేడు, నేరేడు మొదలైన మొక్కలతో పాటు పక్షిగూళ్లు, నీళ్లకుండీలు, పక్షుల దానా కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నటు వివరించారు. వివరాలకు 9989183004 ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే

భవానీనగర్‌లో రహదారుల నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన కాలనీవాసులు

చర్లపల్లి, డిసెంబర్ 16 : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని భవానీ నగర్‌లో రహదారుల నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టేందు కు చర్యలు తీసుకుంటామన్నారు. భవానీనగర్‌లో 50 ఫీట్ల రోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నామని, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, నాయకులు మురళీపంతులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా చెరువు అభివృద్ధిపై సమీక్ష ..

కాప్రా, డిసెంబర్ 16: కాప్రా చెరువు అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీకి చెందిన వివిధ విభాగాల అధికారులు శనివారం చెరువు ప్రాంతంలో క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జరుగుతున్న సివిల్, ఫెన్సింగ్ పనులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, బండ్ రిబిటింగ్, తదితర పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులు వివరించారు. పనులు వేగవంతం చేయాలని సమీక్షలో పాల్గొన్న కాప్రాసర్కిల్ డీసీ ముకుందరెడ్డి సూచించారు. చెరువు చుట్టూ గ్రీనరీ పెంపకం చేపట్టేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ 'గ్రీన్ యాత్ర' ప్రతినిధుల ప్రతిపాదనలపై ఈ సందర్భంగా చర్చించారు. ఇతర మొక్కలకంటే పది రెట్లు వేగంగా పెరిగే 20రకాల చెట్ల పెంపకాన్ని చేపట్టేందుకు సదరు సంస్థ ముందుకు రావడం పట్ల సాను కూలత వ్యక్తం చేశారు. అంతకు ముందు కాప్రా సర్కిల్ కార్యాల యంలో కాప్రా చెరువు అభివృద్ధిపై సంబంధిత అధికారులతో డీసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తాసీల్దార్ మతిన్, చీఫ్ హార్టికల్చర్ అధికారిణి సునంద, ఇరిగేషన్, యూబీడీ అధికారులు, గ్రీన్‌యాత్ర సంస్థ ప్రతినిధులు, కాప్రా లేక్ రివైవల్ ప్రతినిధి చంద్రశేఖర్, జీహెచ్ ఎంసీ టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ నగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ

ఉప్పల్, డిసెంబర్ 16 : నాచారం డివిజన్‌లోని హనుమాన్‌నగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. రోడ్డుపై డ్రైనేజీ పారుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించి, కాలనీలో డ్రైనేజీని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గంజాయి విక్రయాలు.. ముగ్గురు అరెస్టు

చర్లపల్లి, డిసెంబర్ 16 : అక్రమంగా గంజాయి తరలించి, విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. చర్లపల్లి పారిశ్రామికవాడలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు అమ్రిత్‌కుమార్, మంజు శర్మ, రవీంద్ర బీప్రచంద్ పాత్రోలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. వారి బ్యాగులు పరిశీలించగా.. అందులో గంజాయి లభించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని.. 21 ప్యాకెట్లు..42కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ పన్నెండు లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. నిందితులు గంజాయిని విశాఖపట్నం నుంచి చర్లపల్లికి తీసుకువచ్చి పారిశ్రామికవాడ, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ఫోన్ ఆర్డర్ల ద్వార విక్రయిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఘట్‌కేసర్ సీఐ మల్లయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ భరత్‌భూషన్, ఎస్సైలు పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజు, శ్రావణిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి స్కందషష్టి ఉత్సవాలు

నేరేడ్‌మెట్, డిసెంబర్ 16: సైనిక్ పురిలోని శృంగేరి శంకరమఠం విజయగణపతి ఆలయంలో నేటినుంచి స్కందషష్టి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి పండరీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం నాగపంచమి, గణపతి, రుద్ర, నవగ్రహ, ఉద్యోగ, వ్యాపార, 18న స్కం దషష్టి, ప్రత్యేక అభిషేకాలు, 19న అమృత, మృత సంజీవని, మాంగల్యదేవి, రోగనివారణ హోమాలు, తదితర పూజలు ఉంటాయని తెలిపారు. భక్తులందరూ ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని ఆలయ ధర్మాధికారి పండరీనాథ్ తెలిపారు.

పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా కృషి..

ఓల్డ్ అల్వాల్‌లోని స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 16: పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించడానికి కృషి చేస్తున్నామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఓల్డ్ అల్వాల్‌లోని ప్రభుత్వ స్కూల్‌లోని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పోషకాహారాలతో కూడిన భోజనం అందజేస్తున్నామని అన్నారు. విద్యార్థుల మనోవికాసానికి అవసరమైన బుక్స్‌ను అందజేస్తామని అన్నారు. తాగునీరు, బాత్‌రూం సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. విద్యార్థులకు సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయురాలు జ్యోతి, వీణ, జార్జి, తదితరులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి

మల్కాజిగిరి, డిసెంబర్ 16: మల్కాజిగిరి డివిజన్, బాలసరస్వతినగర్‌లో నాలా పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని కోరుతూ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా బాలసరస్వతినగర్‌లో జరుగుతున్న నాలా నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. నర్సింహారెడ్డి నగర్‌లో విద్యుత్ సరఫరాకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ యాదగిరి, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ , తదితరులు పాల్గొన్నారు.